క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



పూసపాటిరేగలో చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. స్థానిక జాతీయ రహదారిపై చలివేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కారణంగా ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో వడి దెబ్బ తగిలే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు 28 పంచాయతీలలో చలివేంద్రాలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. ఆమెతో పాటు ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు ఉన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



ఆస్పత్రి సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సేఫ్టీ అధికారులు

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు పేర్కొన్నారు. నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న శ్రీ సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సిబ్బందికి వివిధ రకాల అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ, వాటి నివారణ చర్యలను గురించి ప్రాక్టికల్‌గా డెమో చేసి చూపించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, ఫైర్ సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



పినతాడివాడ సచివాలయం వద్ద పింఛన్లను పంపిణీ చేస్తున్న సచివాలయ అధికారులు, సిబ్బంది

దెంకాడ: మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ చురుగ్గా ప్రారంభమైంది. గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది బుధవారం మధ్యాహ్నం నుంచి ఆయా గ్రామ సచివాలయాల వద్ద పింఛన్‌దారులకు పింఛన్ నగదును అందజేస్తున్నారు. మండల వ్యాప్తంగా 17 గ్రామ సచివాలయాల పరిధిలో 47 కేంద్రాల ద్వారా 8300 మందికి పింఛన్లను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని చింతలవలస, బొడ్డవలస, జొన్నాడ, మోదవలస గ్రామ సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో లవరాజు పరిశీలించారు.

స్వేచ్ఛగా ఓటు వేయాలి

పూసపాటిరేగ: ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ ఎ.సన్యాసి నాయుడు కోరారు. మండలంలోని బత్తవలస, పూసపాటిరేగతో పాటు పలు గ్రామాలలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విజయనగరం రూరల్: మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంటా వెంకటరావు బుధవారం తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండల శాఖ అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎం జగన్‌తోనే సమగ్రాభివృద్ధి

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని, పేద ప్రజలు మరింత ఆర్థికాభివృద్ధి సాధిస్తారని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండల కేంద్రంలోని పురిటిపెంట న్యూకాలనీ, మెంటాడ జంక్షన్, నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగితేనే రాష్ట్రం సస్యశ్యామలంగా, ప్రజలు సంతోషంగా ఉంటారని అన్నారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య తనయుడు సాయి గురునాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, తుమికాపల్లి, కొత్తశ్రీరంగరాజపురం గ్రామాల సర్పంచ్‌లు బెల్లాన త్రినాథరావు, యిజ్జిరోతు పైడిపునాయుడు, నాయకులు మండల సురేష్, రేగ సురేష్, మంత్రి నర్సింగరావు, సత్యం అప్పలనాయుడు, గేదెల జగదీశ్వరరావు, జి.సన్యాసిరావు, ఇనుమల రాజు, కర్రినానాజి, కర్రి రామునాయుడు, చీపురుపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- అడుగడుగునా ప్రజల బ్రహ్మరథం



పేరాపురంలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు విజయ తిలకం దిద్దుతున్న మహిళలు

పూసపాటిరేగ: రాష్ట్రంలో పేదరికాన్ని శాశ్వతంగా నిర్మూలించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పేరాపురం, గొల్లపేట, పూసపాటిపాలెం గ్రామాలలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారాన్ని చేశారు. మహిళలు, వృద్ధులు, యువత అడుగు అడుగునా బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో చేకూరిన లబ్ధిపై ఇంటింటికి వెళ్లి వివరించి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికలలో ప్రకటించిన నవరత్నాలు నూటికి నూరు శాతం పూర్తి చేశారన్నారు. వాటన్నింటిని కొనసాగించాలంటే ఫ్యాన్‌కు ఓటు వేయాలన్నారు. సమాజంలో సమానత్వం రావాలంటే ప్రతి ఒక్కరు ఆర్థికంగా ప్రగతి సాధించాలన్నారు. దీని కోసమే ఎన్ని కష్టాలు వచ్చినా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కుల, మత రాజకీయాల కతీతంగా ఇంటింటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిలు మంజూరు చేయించామన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసురావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్ధనరావు, అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, రౌతు శ్రీరాంమూర్తి, రౌతు కొండ, కోరాడ మహేష్, ఎడ్ల రామకృష్ణ, పిన్నింటి ఎల్లంనాయుడు, దాడిశెట్టి త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

ఏం మాయదారి రోగమో.. మాపై పడ్డారు...



నెల్లిమర్ల రూరల్: పింఛన్ కోసం సీతారామునిపేట సచివాలయం వద్ద పడిగాపులు



నెల్లిమర్ల రూరల్: పింఛన్ కోసం రాత్రి సమయంలో జగ్గరాజుపేట నుంచి ఆటోలో వెళ్తున్న వృద్ధులు

నెల్లిమర్ల రూరల్: ఎంతో చక్కగా ప్రతి నెలా 1వ తారీఖున కోడి కూయక ముందే పింఛన్ సొమ్ము అందుకునే వాళ్లం.. వలంటీర్లు నేరుగా ఇంటికే వచ్చి సొమ్ము ఇచ్చే వారు.. కదల్లేని స్థితిలో ఉన్న మాకు ఎంతగానో మేలు జరిగిందని సంతోష పడ్డాం. మాకు వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇవ్వొద్దంటూ ఫిర్యాదులు చేశారు.. ఏం మాయరోగమో మాపై పడ్డారంటూ అవ్వా తాతలు ఆవేదన వ్యక్తం చేయడం ఆయా గ్రామాల సచివాలయాల వద్ద బుధవారం కనిపించింది. పింఛన్ల కోసం పాత రోజుల వలె లైన్లో నిలబడ్డారు. వలంటీర్లు లోటు కనిపిస్తుందంటూ బాధపడ్డారు. సీతారామునిపేట సచివాలయ పరిధిలో రాత్రి సమయంలో కూడా పింఛన్ల పంపిణీ కొనసాగింది. జగ్గరాజుపేట గ్రామం నుంచి సీతారామునిపేటకు వృద్ధులు రాత్రి సమయంలో ఆటోలో వెళ్లారు.

నేడు కోరుకొండ గ్రామదేవత జాతర



బంగారమ్మ తల్లి

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ గ్రామంలో గ్రామదేవత బంగారమ్మ తల్లి జాతర గురువారం నిర్వహించనున్నామని కోరుకొండ గ్రామ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల నుండి పులివేషాలు, బళ్ల వేషాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఉత్సవంలో భక్తులందరూ పాల్గొనాలని వారు కోరారు.

ప్యాకేజీ కోసమే కాళ్ల దిగజారుడు ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి తవిటిరాజు

విజయనగరం: నగర బహిష్కరణకు గురైన కాళ్ల గౌరీశంకర్ లాంటి వ్యక్తి, నిష్కలంక ప్రజానాయకుడు కోలగట్ల వీరభద్రస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరానిదని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, కనకల కృష్ణ మాట్లాడారు. విశ్వసనీయత లేని కాళ్ళ గౌరీశంకర్ మాటలను ప్రజలు నమ్మరని అన్నారు. ప్రజాసేవే పరమార్థంగా నిరంతరం కృషి చేస్తున్న వీరభద్ర స్వామి లాంటి వ్యక్తిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్న గౌరీ దిగజారుడుతనాన్ని చూసి సిగ్గుపడుతున్నామన్నారు. కేవలం తన ఉనికిని కాపాడుకునేందుకే ఇతర పార్టీల చెంతన చేరి కోలగట్లపై విమర్శలు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇతర పార్టీల వద్ద ప్రాపకం, ప్యాకేజీల కోసమే ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నాడని వ్యాఖ్యానించారు. అర్బన్ బ్యాంకులో డమ్మీ మీటింగులు పెట్టి బ్యాంకును కొల్లగొట్టిన వైనం అందరికీ తెలిసిందేనని అన్నారు. మరోసారి నోరు జారితే గౌరీ బండారం బయట పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో విశాఖపట్నం నుంచి ఎన్ని లారీలతో బియ్యం తెచ్చాడో మరిచిపోయాడని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ కనకల నాగవల్లి, అవనాపు రాజు, కాళ్ళ సూరిబాబు, బేరి సత్యనారాయణ, కనకలగిరి, మహేష్, రామ్ సింగ్ ప్రసాదు, మొకర సతీష్, సూరాల కృష్ణ,బుగత జయరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: నగరంలోని 132 కేవీ ఒంటి తాడి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైనులు మరమ్మతు కారణంగా గురువారం ఉదయం 7.30 గంటల నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ ఒంటితాడి సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 33 కేవీ పద్మనాభం, ఒంటి తాడి, చిట్టివలస, 33 కేవీ విజయనగరం పరిధిలో గల విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఉన్న తోటపాలెం, ఆర్టీసీ కాంప్లెక్సు ఏరియా, ధర్మపురి, ఎస్వీఎన్ నగర్, జమ్ము నారాయణపురం, సింగ్‌పూర్ సిటీ, రింగ్ రోడ్, దాసన్నపేటలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



బొండపల్లి: జియ్యన్నవలసలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు



గంట్యాడ: దిగువకొండపర్తిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

బొండపల్లి: ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని గొట్లాం పంచాయతీ పరిధి జియ్యన్నవలస గ్రామస్తులకు ఎన్నికల నిబంధనలపై బుధవారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పక్కాగా పాటించాలని సూచించారు. అనవసరంగా గొడవలకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దని, నిబంధనలకు లోబడి నడుచుకోవాలన్నారు. రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దని సూచించారు.రాజకీయ పార్టీలు ఎలాంటి ర్యాలీలు నిర్వహించాలనుకున్నా అనుమతి తప్పనిసరని అన్నారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని, తగాదాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఎస్‌ఐ కె.లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

గంట్యాడ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలంతా సహకరించాలని విజయనగరం రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు కోరారు. దిగువ కొండపర్తి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గొడవలకు పాల్పడి చిక్కుల్లో పడవద్దని అన్నారు. ఎస్‌ఐ సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం

విజయనగరం: ఉత్తరాంధ్రకు చెందిన ముగ్గురు ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లకు ఒకే వేదికపై సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి దేవాలయం ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ముందుగా వాసవీమాత ప్రార్థనతో ప్రారంభమైన సభకు శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దానగుణం కలిగి ఉంటారని, తను సంపాదించిన దానిలో కొంతభాగాన్ని సేవకు వినియోగిస్తారని అన్నారు. ఇటీవల ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్లుగా విజయనగరం నుండి నియమితులైన కుమ్మరిగుంట శ్రీనివాసరావు, శ్రీకాకుళం నుండి తమ్మాన భాస్కర్, విశాఖపట్నం నుండి గునిశెట్టి శ్రీనివాస్‌లను అభినందనలు తెలియజేస్తూ ఘనంగా సత్కరించారు. స్థానిక శాసనసభ్యులు కోలగట్ల వీరభద్రస్వామి ఆశీస్సులతో డైరెక్టర్ అవకాశం లభించినట్లు చెప్పారు. విశాఖపట్నం డైరెక్టర్ జి. శ్రీనివాస్, శ్రీకాకుళం డైరెక్టర్ తమ్మాన భాస్కర్ ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య మిత్రులు గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయం కన్వీనరు పెంటపాటి కామరాజు, ప్రముఖ న్యాయవాది బొడ్డు సత్యనారాయణ, ఉడుత కాశీ, వాసవీ క్లబ్ గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న దాత బంధువులు

లక్కవరపుకోట: అమెరికాలో ఉంటున్న మండలంలో మల్లివీడి గ్రామానికి చెందిన బైలపూడి మధు దంపతులు కొత్తపాలెంలో నిర్మించిన రామాలయానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. నగదును దాత బంధువులు పాలవెల్లి, బోను సన్యాసిరావు ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఆలయ ప్రతిష్టను బుధవారం వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల కోసం..ఓ పార్క్

- విజయనగరంలో ప్రత్యేకంగా మహిళా పార్క్
- రూ.2 కోట్ల వ్యయంతో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచెలా సదుపాయాలు
- 1.75 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక జిమ్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు
- చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలు
- అమృత్ పథకం, సాధారణ నిధులతో సుందరంగా పార్క్ పరిసరాలు
- రాష్ట్రంలోనే మొదటి పార్క్‌గా గుర్తింపు



మహిళా పార్క్



స్విమ్మింగ్ పూల్



పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట వస్తువులు

విజయనగరం: ఇంట్లో ఇల్లాలిగా... పోటీ ప్రపంచంలో మగవారితో ధీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళల కోసం నగరం నడిబొడ్డులో ఏర్పాటు చేసిన ప్రకాశం పంతులుగారి మహిళా పార్కు మహిళల ఆదరణ చూరగొంటుంది. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం ఒకే చోట లభిస్తుండటంతో ప్రతి రోజు సందర్శకుల తాకిడి పెరుగుతోంది. ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆలోచనల మేరకు కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉండే ప్రకాశం పార్కును అందుకు అనువుగా తీర్చిదిద్దగా... అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమృత్ పథకంలో రూ.1.10 కోట్లు, కార్పొరేషన్ సాధారణ నిధుల నుంచి మరో రూ.90 లక్షలతో 1.75 ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కు నిర్మాణ పనులు చేపట్టారు.

రాష్ట్రంలో మొదటి మహిళా పార్కుగా గుర్తింపు

విజయనగరంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కు రాష్ట్రంలోనే మొదటి మహిళా పార్కుగా గుర్తింపు పొందింది. గతంలో ప్రకాశం పార్కుగా ఎంతో ఆదరణ పొందిన ఈ పార్కు దశాబ్ద కాలంగా ఆదరణకు నోచుకోకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఆలోచనలతో మహిళల కోసం ప్రత్యేకంగా ఈ పార్కును తీర్చిదిద్దారు. ఈ పార్కులో కేవలం మహిళలు, చిన్నారులకు మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నారు. మొత్తం రూ.2 కోట్లతో అభివృద్ధి చేసిన పార్కు ఆవరణలో ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందించుకునేలా సదుపాయాలు కల్పించారు. అంతేకాకుండా వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ పార్కుల ఏర్పాటు చేశారు. పార్కులో ఎటువైపు చూసిన ప్రకృతి పలకరించేలా అందమైన చెట్లుండగా.. తాజాగా వివిధ రకాల మొక్కలు నాటారు. మహిళలు ఈత సాధన కోసం స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేయటం విశేషం.

నిర్వహణ పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీ

ఈ పార్కులో కేవలం నగర ప్రజలతో పాటు వివిధ ప్రాంతాల నుంచే వచ్చే మహిళలకు ప్రవేశం కల్పించనున్నారు. దీంతో వారంతంలో విశాఖ, అరుకు తదితర పర్యాటక ప్రాంతాలకు వెళ్లే మహిళలు ప్రస్తుతం నగరంలోనే ఆనందంగా గడుపుతున్నారు. రూ.2 కోట్ల వ్యయంతో మహిళల కోసం ఏర్పాటు చేసిన పార్కు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పార్కులో వసతుల కల్పన, రోజు వారి నిర్వహణపనుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా కమిటీని నియమించారు.

రాష్ట్రానికే తలమానికం

విజయనగరం కార్పొరేషన్ పరిధిలో రూ.2 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన మహిళా పార్కు రాష్ట్రానికే తలమానికంగా నిలుస్తోంది. ప్రజాప్రతినిధులు సూచనలు, సలహాలతో పార్కులో మహిళలకు ఆహ్లాదాన్ని అందించే సౌకర్యాలతో పాటు ఆరోగ్యాన్ని సమకూర్చే వసతులు ఏర్పాటు చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా పార్కు నిర్మించి వారికే కేటాయించటం మహిళకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం.

– ఆర్. లక్ష్మి, విజయనగరం.